❖•❖•❖ 24 ❖•❖•❖

# చేతులు కడుగుకొను పళ్ళెము

*"పిలాతు అల్లరి ఎక్కువగుచున్నదే గాని తనవలన ప్రయోజనమేమియు లేదని గ్రహించి, నీళ్లు తీసికొని జనసమూహము ఎదుట చేతులు కడుగుకొని – 'ఈ నీతిమంతుని రక్తమును గూర్చి నేను నిరపరాధిని, మీరే చూచుకొనుడని' చెప్పెను. అందుకు ప్రజలందరు – వాని రక్తము మా మీదను మా పిల్లలమీదను ఉండుగాకనిరి" (మత్తయి 27:24, 25).*

యేసును గూర్చిన తీర్పులు చివరిదశకు చేరుకొనుచుండగా, యేసుకు విరోధంగా మోపబడిన నేరముల విషయములో ఆయన నిరపరాధియని పిలాతు తన తుది నిర్ణయమును తెలియజేశాడు. పిలాతు వెలుపల ఉండిన ప్రధానయాజకులు మరియు జనసమూహము యొద్దకు వెళ్లి, "ఈ మనుష్యుని యందు నాకు ఏ నేరమును కనబడలేదు" (లూకా 23:4) అని చెప్పినట్లు మత్తయి నివేదించుచున్నాడు. దీనికితోడుగా, యేసు హేరోదు నుండి తిరిగి తన యొద్దకు వచ్చిన తరువాత, పిలాతు ప్రధాన యాజకులను, అధికారులను, మరియు ప్రజలను మరొకసారి పిలిపించి,

> ప్రజలు తిరుగబడునట్లు చేయుచున్నాడని మీరీమనుష్యుని నా యొద్దకు తెచ్చితిరే, ఇదిగో, నేను మీయెదుట ఇతనిని విమర్శింపగా, మీరితని మీద మోపిన నేరములలో ఒక్కటైనను నాకు కనబడలేదు; హేరోదునకు కూడ కనబడలేదు. హేరోదు అతని మాయొద్దకు తిరిగి పంపెను గదా; ఇదిగో మరణమునకు తగినదేదియు ఇతడు చేయలేదు అని చెప్పాడు (లూకా 23:14, 15).

పిలాతు చెప్పినవిగాని లేక ఆయన చేసినవిగాని ఏదియును యూదులకు సంతృప్తినివ్వలేదు. పస్కా పండుగ సందర్భంలో గల వాడుక ప్రకారము, ఒక ఖైదీని విడుదల చేయు వాడుక కలదని చెప్పినను, పరిస్థితి అదుపులోనికి రాలేదు. బరబ్బను విడుదల చేయుమని కోరుకొనిన తరువాత, వారు యేసును గూర్చి, "వానిని సిలువవేయుము!" అని కేకలు వేసారు (మత్తయి 27:22).

పరిస్థితి అంతకంతకు ఉన్మాదముతో కూడినదై అదుపుచేయబడలేని అల్లకల్లోముగాను, అసూయ, మరియు ఆగ్రహముతో తీవ్రతరము దాల్చుచుండినది. పిలాతు మనస్సాక్షి ఏమి చేయాలో దిక్కు తోచని పరిస్థితిలో పడింది. చివరకు తన మనస్సులో చెలరేగుచుండిన మౌననిరాశను భయమును మనస్సులోనే దాచుకొనుచు, ప్రజల కోరిక మేరకు అయిష్టంగానైనా సమ్మతించాడు. వారడుగుచుండినది న్యాయసమ్మతమైన హక్కు అని అతనిని ఒప్పించకుండానే, మరియు ఆయన యెదుట నిలువబెట్టినవాడు దోషి యని రుజువుచేయకుండానే, వారు కోరినదే చేయుటకు పిలాతు లొంగిపోవునట్లు యూదులు ఆయనపై ఒత్తిడిని పెంచారు. గనుక పిలాతు ఇప్పుడు చెప్పుకోదగినంత రక్తపాతముతో అచ్చట కూడుకొని యుండిన జనసమూహమును

చెదరగొట్టుటకు తన సైనికులకు ఆజ్ఞాపించగలడు లేదా యూదుల కోరికకు తలవంచగలడు. ఒక ప్రక్క తన సంకల్పము బలహీనపడుచుండగా మరొక ప్రక్క సంభవించిన దానిని రోమా ప్రభుత్వము గంభీరంగా తీసుకొనునేమోనను భయము కలుగుచుండినందువలన పిలాతు తన మనస్సాక్షిని మరుగున ఉంచి ప్రభుత్వము వైపే తల ఒగ్గాడు. "పిలాతు అల్లరి ఎక్కువగుచున్నదే గాని తన వలన ప్రయోజనమేమియు లేదని గ్రహించి, ... యేసును కొరాడాలతో కొట్టించి సిలువవేయనప్పగించెను" అని మత్తయి వ్రాయుచున్నాడు (మత్తయి 27:24-26).

తన పదవిని ప్రకటించుకొనుటకును త్వరలోనే జరుగనై యుండిన సిలువ మరణము విషయములో తన నిర్దోషత్వమును చాటిచెప్పుటకును ఒక చిట్టచివరి భావ సూచనగా, పిలాతు తన చేతులు కడుగుకొనుటకు నీళ్లతో నిండిన పళ్లెమును తీసుకరావలెనని ఉత్తరవులిచ్చాడు. బహిరంగమైనది, మరియు తన మనస్సాక్షిని శాంతింపజేసుకొను సంకేతమునైయున్న చర్యగా అన్నట్లు, తీసుకరాబడిన నీటితో తన చేతులను కడుగుకొనుచు, "ఈ నీతిమంతుని రక్తమును గూర్చి నేను నిరపరాధిని" అని పలికాడు (మత్తయి 27:24). యేసు సిలువ మరణము విషయములో తనకు ఎటువంటి బాధ్యత లేదని చెప్పుచు తనను తాను తప్పించు కొనుటకై ఉద్దేశించిన అతని నాటకీయమైన ఈ చర్య, "వాని రక్తము మా మీదను మా పిల్లల మీదను ఉండుగాక!" అను హఠము మరియు సహానుభూతిరహితమైన కేకలను ఎదుర్కొన్నది (మత్తయి 27:25).

యేసు తీర్పులోని ఈ ఉదంతము జరిగి రెండువేల సంవత్సరాలు గతించిపోయాయి కదా అన్నట్లగుపించుచున్నప్పటికిని, అది మనకు ఎన్నో సత్యములను నేర్పించుచున్నది.

*పిలాతు రక్తపిపాసులైయుండిన జనసమూహము కోరిక ప్రకారము యేసును అప్పగింపక మునుపు తన చివరి చర్యలో, యేసు యొక్క నైతికము మరియు పాపరహితమైన పరిపూరితను గూర్చి సాక్ష్యమిచ్చాడు, పిలాతు,* "ఈ నీతిమంతుని రక్తమును గూర్చి నేను నిరపరాధిని" అని చెప్పాడు (మత్తయి 27:24). ఆయన తీర్పులు తీర్చుచుండినప్పుడు యేసులో ఏ దోషమును కనగొనలేదని పిలాతు ముమ్మారు చెప్పాడు. జనసమూహము వారుకోరుకొన్న ప్రకారము తీర్పును పిలాతునుండి సాధించుకొన్నారు; కానీ వారు దొంగచాటుగా ఎంత ఒత్తిడి చేసినప్పటికిని, యేసు దోషియని తీర్పు నిచ్చునట్లు పిలాతును ఒప్పించలేకపోయారు. పిలాతు తన నైతిక విచక్షణను కాపాడుకొనుచు చివరి వరకు కూడ నిజాయితీగల తీర్పు వైపే నిలుచుటకు నిభాయించుకొన్నాడు. యేసు నిర్దోషత్వము గూర్చి తుది ఘోషణ ఏదీ చేయకుండా ఆయనను విడుదలచేయగోరలేదు.

యేసు జీవితము మరియు నడవడిక గూర్చిన దృష్టి ఏదైనను పిలాతు యొక్క తుది అభిప్రాయమునే తెలియజెప్పును, హాస్య ప్రధానమైన ఈ నాటకీయమగు తీర్పులో, ఏ పాపముగాని, పొరపాటైన చర్యగాని, లేదా పథభ్రష్టమైన పలుకుగాని యేసు జీవితంలో కనబడలేదు. ఎలాగైనాసరే యేసు సిలువ మరణమునకు అప్పగింపబడవలెనను ప్రయత్నములో, ఆయన శత్రువులు దోషము తప్ప ఆయనపై ఏదో ఒక అపనింద మోపవలసివచ్చినదని తేటతెల్లముగా తెలియుచున్నది.

*ఈ చర్యలో, నిర్దోషి పక్షముగా నైతిక నిబ్బరమును వ్యక్తము చేయుటలో మానవుని వైఫల్యము మనకు విదితముగా కనబడుచున్నది.* సంకోచములేకుండానే, "ఒక ప్రభుత్వాధికారిగా, 'ఈ మనుష్యుడు నిర్దోషి, గనుక ఇందుమూలమున నేను ఆయనను విడుదల

చేయుచున్నాను' అని పిలాతు చెప్పవలసియుండెనని" మనము చెప్పుదుము. నీతిమంతుని పక్షమున ప్రతివాదించుటకు బదులుగా పిలాతు ఆయనను దుష్టులును ఘాతుకమైన జనసమూహమునకు అప్పగించాడు. పిలాతు చేసినదానినిబట్టి, ప్రజాభిప్రాయము ఆతనికి తీవ్రమైన తీర్పునిచ్చినది. "పిరికివాడైన పిలాతు" అను బిరుదుతో చరిత్రలో లిఖింపబడ్డాడు. కలహముతో కూడిన పరిస్థితి ఒత్తిడిలో సత్యము పక్షమున నిలుచుటకు ధైర్యములేకుండిన ఒక ప్రభుత్వాధికారిగా మనము ఆయనను గుర్తుచేసుకొంటాము. ఈ నాటికి కూడా ఏ తండ్రి యైనను తన కుమారునికి "పిలాతు" అను పేరు పెట్టడు. మనము ఏ రీతిలోనైనా పిలాతు వలె ఉంటున్నామను ఆలోచన కలిగినప్పుడు దాని గూర్చి భయముతో కూడిన అణకువతో ప్రవర్తిస్తాము, ఏలయనగా ఆయన తన చేతులను ఉపయోగించుటకు బదులుగా కడుగుకొన్నాడు. ఆయన బాధ్యతను తన భుజస్కంధములపై వేసికొనుటకు బదులుగా దాని నుండి తప్పించుకొన్నాడు.

పిలాతు చేసిన దానిని మనము మన మనస్సుల్లో నుండి అంత సులభంగా కొట్టివేయలేము. "నిర్దోషులకు న్యాయము చేకూర్చబడవలసిన అవసరమున్నప్పుడు పిరికిపందగా ప్రవర్తించినవాడు పిలాతు ఒక్కడు మాత్రమేనా?" అని మన మనస్సాక్షి మనలను ప్రశ్నించవచ్చును. వాస్తవమునకు, పిలాతు సామాన్యంగా మానవాళియందంతటనూ గల ఒక మచ్చకు ప్రతినిధియై యున్నాడు. ఈ నేరము విషయములో మనమందరమును దోషులమని తీర్చబడమా? నిర్దోషుల పక్షము వహించి వారిని గూర్చి ప్రతివాదించుటకు నోరువిప్పి మాట లాడుటకు సమయము వచ్చినప్పుడు, వారికి సహాయము చేయుటలో మనము ఎంత వరకు సఫలీకృతులమగుచున్నాము? మనము అనుకూలము వైపు ఆకర్షింపబడి అటువైపుగానే జరిగిపోతున్నామా లేక ధైర్యం వహించి పోరాడుచున్నామా? మనము ఎన్నడును ఊరకనే జనసమూహము కోరిక మేరకు చేయకుండా ధైర్యముతో న్యాయసమ్మతమైన చర్య నిమిత్తము పోరాడవలెను.

కొన్ని సంవత్సరముల క్రితం, నేను నా కుటుంబము మార్టిన్ లూథర్ కింగ్, జూనియర్ యొక్క జీవితము, ఆయన సాధించిన ఘనకార్యములు మరియు దొంగచాటుగా జరిగిన ఆయన హత్యకు సంబంధించిన స్మారక దినం పాటించు టెన్నెస్సీ రాష్ట్రములోని మెంఫిస్ నగరంలో గల జాతీయ పౌర హక్కుల సంగ్రహాలయమును సందర్శించాము. అర్కన్సాస్, లిటిల్ రాక్‌లోని కేంద్రీయ ఉన్నది పాఠశాలలో 1957వ సంవత్సరంలో జరిగిన పౌరుల రాజకీయ అంతర్యుద్ధమును ప్రధానదృశ్యంగా ప్రదర్శించిన విభాగమును చూచుచుండినప్పుడు కొన్ని రోజుల క్రితమే తన ఇరవైయవ యేట ప్రవేశించిన నా కుమారుడు, "నాన్నగారూ, దీని గూర్చి మీకు తెలియునా?" అనడిగాడు. "తెలుసు" అని అన్నాను. వెనువెంటనే, "కానీ, నేను అప్పుడు చాలా చిన్నవాడను. దాని గూర్చి కొంచెమే విన్నాను" అని అన్నాను. "అలాగైతే, దాని గూర్చి మీరెందుకు ఏమీ చేయలేదు?" అని నాకు వేసిన ప్రశ్నాబాణం నా గుండెల్లోకి గుచ్చుకుపోయింది. పిలాతును దండించు నిత్య న్యాయాధిపతి మనలో అనేకులము దోషులమేనని మన వైపు కూడ తన వ్రేలెత్తి చూపించుచున్నాడు. మనము నిర్దోషుల పక్షంగా నోరు తెరచి మాటలాడవలసిన తరుణంలో మౌనంగా ఉంటున్నాము గనుక అది మనకు తీర్పు తీర్చుచున్నది.

*ఇంకా, కళ్లకుకట్టినట్లుగా మన యెదుటనున్న చిత్రీకరణలో, యేసు రక్తము గూర్చి*

*ఏ ఒక్కరును నిర్దోషులై యుండలేరని ఈ ఉదంతము మనకు గుర్తుచేయుచున్నది.* ఆయన రక్తమును గూర్చి నీవు నిరపరాధివని చెప్పుట నిన్ను అలా చేస్తుందా? ఆయన ప్రభుత్వాధికార పదవిలో ఉంటూ ఒకరు సిలువవేయబడక మునుపు తుది న్యాయ నిర్ణయమును ప్రకటించవలసి యుండగా, కేవలము చేతులు కడుగుకొంటూ ఈ బాధ్యత గూర్చి తనలో ఏ తప్పులేదని ఎలా తప్పించుకొనగలడు? తాను నిర్ణయము తీసుకొనవలసినదని బాధ్యత ఆయనకు అప్పగింపబడినదేగాని దానిని మరెవరికైనను విడిచిపెట్టుటకు కాదు. కర్తవ్యం ఆయన చేతుల్లో ఉన్నది గనుక, దానిని ఏ నీళ్లును కడిగివేయలేవు.

ఈ భయానకమైన విషయములో జోక్యము చేసికొనకుండా పిలాతు నిజముగా క్షమాపణ చెప్పలేకపోయాడు, కానీ మనము కూడ అంతే, యేసు రక్తము గూర్చి యూదులు దోషులై యుండిరి. యేసు రక్తమును మరియు జరుగుచుండిన ఘోరమును గూర్చిన దోషము వారి మీద ఉండుగాకని వారు పలికారు. ఏది ఏమైనా, పిలాతువలెనే, మనము కూడ దోషులమై యున్నాము. యేసును సిలువవేసినది మన పాపములే. వాస్తవమునకు, యేసు రక్తమును గూర్చి మనము దోషులమని మనము అంగీకరిస్తే తప్ప, మనము రక్షింపబడలేము (1 యోహాను 1:8, 10).

ఈ తీర్పును ఏ సమయంలోనైనా ఏ దశలోనైనా ముగించుటకు యేసు సమస్త అధికారమును కలిగియుండెను, కానీ మన మేలు నిమిత్తమే ఆయన దానిని కొనసాగనిచ్చాడు. యేసుకు విరోధముగా మోపబడిన ఏ నేరమైనను న్యాయసమ్మతమైనది కానేకాదు. జనసమూహము ఆయనను సిలువ వేయునట్లుగా, వారు దొంగచాటైన, అమితమైన ఒత్తిడిని ఉపయోగించుచు అబద్ధపు నిందలు మోపవలసివచ్చినది. యేసు మన కొరకు మరణించునట్లు, ఆయన సరిపోని, గుండెధైర్యములేని ప్రభుత్వాధికారి యెదుటను అన్యాయమైన, కుయుక్తిగా రూపొందించబడిన తీర్పు యెదుటను నిలువబడియుండెను, అది ఆయన తీసుకొన్న నిర్ణయమే, కానీ మానవుని నిర్ణయము కాదు. మనము పుట్టక మునుపే, మన అవసరతను చూచిన యేసు మన కొరకు మరణించుటకు సహితము ఎన్నుకొన్నాడు. ప్రధాన యాజకులు, యూదులు, జనసమూహము, అన్న, కయప, పిలాతు, హేరోదు, మరియు నీవు నేనూ యేసును సిలువవేశాము.

❖◆❖◆❖

*చేతులు కడుగుకొను ఈ పళ్లెము, ఒక సాలంకృతమైన గిన్నె ఉండగల రీతిలో మౌనము వహించినను, వినగలవారితో బిగ్గరగా మాటలాడుచున్నది. కేవలము సంకేతముతో బాధ్యత తప్పించుకొనబడజాలదనియు, యేసు రక్తమును గూర్చి ఏ ఒక్కరైనను నిరపరాధులైయుండజాలరనియు, ఆయన గెత్సేమనే తోటలో ఉన్నప్పుడే మన కొరకు మరణించవలెనని తీర్మానించుకొన్నాడు గనుకనే యేసు పిలాతు యెదుట నిలువబడుటకు అంగీకరించాడనియు అది తెలియజెప్పుచున్నది. పళ్లెములో చేతులు కడుగుకొనుట ద్వారా పిలాతు జనసమూహముతో మాట్లాడవలెనని ఉద్దేశించాడు, కానీ ఆయన దాని ద్వారా తాను అనుకున్నదాని కంటె ఎక్కువే చాటిచెప్పాడు. ఆయన తన యొక్కయు మన యొక్కయు స్వభావము గూర్చి తెలియజెప్పాడు. మనము దీనిని పిలాతు వలె ఎన్నడునూ ఉపయోగించకుండునట్లు చేతులు కడుగుకొను ఈ పళ్లెము చెప్పుచున్న మాటలు ఆలకించుదాము.*

*దేవుని యెదుట మారుమనస్సు కొరకు మనవిచేయువారికి, యేసు మరొక విధమైన పళ్లెమును – గాయపర్చబడుచున్న మనస్సాక్షి ఒక్క క్షణంలో కడుగుకొనుటకు కాదు, కానీ యథార్థముగా కడుగుకొని సంపూర్ణంగా శుద్ధినొందుటకు దేవుడభిషేకించిన సాధనముగా – అనుగ్రహించుచున్నాడు. ఇది మనస్సాక్షిని బాగుగా కడిగి ఆత్మ ఎటువంటి దోషమైనను గాని కళంకమైనను లేకుండా కడుగునదై యున్నది. దీని*

*గూర్చి పేతురు ఇలా వ్రాస్తున్నాడు: "దానికి సాదృశ్యమైన బాప్తిస్మము, ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది; అదేదనగా శరీరమాలిన్యము తీసివేయుట కాదు గాని – యేసు క్రీస్తు పునరుత్థాన మూలముగా – దేవుని విషయము నిర్మలమైన మనస్సాక్షినిచ్చు ప్రత్యుత్తరమే" (1 పేతురు 3:21).*